andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 ; కనిష్ఠం 17.8

నిర్మల్ జిల్లా వార్తలు

8

మంగళవారం 6 ఫిబ్రవరి 2024



ఓటింగ్ యంత్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో మొదటి విడత తనిఖీ నిర్వహించారు. ఈ నెల 14 వరకు తనిఖీ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈవీఎం గోదాంలో ఈ తనిఖీని ప్రారంభించగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ తనిఖీ జరిగింది. పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు గోదాంకు తరలించామన్నారు. సీయూలు, వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్లు తనిఖీ చేయనున్నామన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు కృషి చేయాలి

ఫిబ్రవరి 12న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయా లన్నారు. 1 నుండి 19 వయసు పిల్లలకు మాత్రలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 1,91,731 పిల్లలున్నట్లు తెలిపారు. 12న మాత్రలు వేసుకోని వారికి 19న వేయాలన్నారు. 1, 2 వయసు గల పిల్లలకు 200ల ఎంజీ, 2 నుండి 9 పిల్లలకు 400ల ఎంజీ మాత్ర పంపిణీ చేయాలన్నారు. భోజన అనంతరం విద్యార్థులకు నేరుగా ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా వైద్యాధికారి ధనరాజ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 47 దరఖాస్తులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సమక్షంలో నిర్వహించిన ప్రజావాణిలో 47 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా భూ సంబంధిత, పెన్షన్‌లపై దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తి అవసరం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, అగ్ని విపత్తులు, భూకంపాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తి అవసరమని 10 బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ ఇన్స్‌పెక్టర్ పింటూ నంది అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అగ్నిమాపక సిబ్బంది, అధికారులు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

'కులగణనకు ప్రభుత్వ ఆమోదం స్వాగతిస్తున్నాం'

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేసేందుకు క్యాబినెట్ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ యు.కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కుల గణనతో బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు.

లోక్‌సభ సీటుపై సంఘ్ పరివార్ నజర్



- ఆదిలాబాద్ బీజేపీ టికెట్ కోసం పట్టు
- రాష్ట్రంలో ఓ సీటు కేటాయించాలంటూ ప్రతిపాదనలు
- పోటీలో తెరపైకి ఓ వైద్యుడు
- సంఘ్ పెద్దలతో సంప్రదింపులు
- ఎమ్మెల్యేల మద్దతు కోసం ప్రయత్నాలు
- ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు టికెట్‌పై గురి

నిర్మల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఈ సారి ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సంఘ్ పరివార్ యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటి వరకు బీజేపీకి అండదండగా నిలుస్తూ సిద్ధాంతిక పరంగా బాసటగా ఉంటున్న సంఘ్ పరివార్ వ్యూహాత్మకంగా ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధమవుతుండడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. బీజేపీ తరపున ఈ సారి ఎంపీగా పోటీ చేసేందుకు చాలా మంది సీనియర్ నాయకులు గత కొద్దిరోజుల నుంచి ముమ్మరమైన ప్రయత్నాలు సాగిస్తున్న నేపథ్యంలో తాజాగా సంఘ్ పరివార్ ప్రతిపాదన తెరపైకి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇప్పటికే సంఘ్ పరివార్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా అనేక కార్యకలాపాలను కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. గిరిజన ఆదివాసీ ప్రాంతాల్లో చేపడుతున్న కార్యక్రమాలకు మంచి స్పందన సైతం లభిస్తోంది. దీంతో పాటు సంఘ్ పరివార్ గిరిజన ప్రాంతాల్లో పట్టు కూడా సాధించిందంటున్నారు. ఇలాంటి కారణాలతో ఎంపీ సీటు కోసం పోటీ చేయాలన్న చర్చ సంఘ్ పరివార్‌లో మొదలైందంటున్నారు. సంఘ్ పరివార్‌కు చెందిన కొంతమంది సీనియర్‌లు ఓ డాక్టర్ పేరును ప్రతిపాదిస్తున్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే చెందిన ఓ డాక్టర్ పేరును సంఘ్ పరివార్ ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. గత కొంతకాలం నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ అనేక సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటున్న డాక్టర్ రాహుల్‌నాయక్ పేరును కొంతమంది సంఘ్ పరివార్ ప్రతినిధులు పరోక్షంగా ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. సరస్వతీ శిశు మందిర్‌లో విద్యాభ్యాసం చేసిన రాహుల్‌నాయక్ మొదటి నుంచి కరుడు గట్టిన జాతీయ భావాలు గల వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఈయన విద్యార్థి సంఘాల్లోనూ ఎంబీబీఎస్ చదివే రోజుల్లో జూడా అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో డాక్టర్ రాహుల్‌నాయక్ అందించిన సేవలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సామాజిక కార్యక్రమాల్లో రాహుల్‌నాయక్ చురుకైన పాత్రను పోషించి ముందు వరుసలో నిలిచారంటున్నారు. ఇతనికి సీనియర్ నగర్ సంచాలక్ మద్దతునిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి చెందిన సీనియర్‌లకు ఆ పార్టీ టికెట్‌లు కేటాయిస్తున్న నేపథ్యంలో ఈ సారి మాత్రం అదే పార్టీ నుంచి సంఘ్ పరివార్ ప్రతినిధికి అవకాశం ఇవ్వాలంటున్న డిమాండ్ క్రమంగా విస్తరిస్తోందని చెబుతున్నారు.

ఇప్పటికే పలువురు సీనియర్‌లు

కాగా బీజేపీ తరపున ఎంపీగా పోటీ చేసేందుకు పలువురు సీనియర్ నాయకులు గత కొద్దిరోజుల నుంచి ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ముథోల్ నియోజకవర్గానికి చెందిన రాజేశ్‌బాబు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, సినీనటుడు అభినవ సర్దార్ కేతావత్‌లతో పాటు మరికొంతమంది సీనియర్‌లు ముమ్మరంగా టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. వీరంతా ఇప్పటికే తమకు టికెట్‌ను కేటాయించాలంటూ అధిష్ఠానం వద్దకు వెళ్ళి వినతిపత్రాలు అందించారు. అలాగే జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలను సైతం ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. నిర్మల్ ప్రాంతంతో పాటు ఆదిలాబాద్ నియోజకవర్గానికి చెందిన మరికొంతమంది కూడా బీజేపీ టికెట్‌ను ఆశిస్తుండడంతో టికెట్ కోసం పోటీ తీవ్రమవుతోందని అంటున్నారు.

మారుతున్న సమీకరణాలు

కాగా ఇతర పార్టీల కన్నా ఎక్కువగా బీజేపీలోనే టికెట్‌ను ఆశిస్తున్న వారి సంఖ్య తీవ్రమవుతున్న కారణంగా అధిష్ఠానం సైతం ఈ దిశగా సీరియస్‌గా దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. బీజేపీలోకి ఇటీవల వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, సీనియర్‌లు చేరుతున్న సమయంలో లోక్‌సభ టికెట్ కేటాయింపు విషయంలో ఆ పార్టీ కొత్త చిక్కులు ఎదుర్కొనే అవకాశం ఉందంటున్నారు. అందరి చూపు బీజేపీ వైపు నిలుస్తున్న కారణంగా టికెట్ సాధించడం ఆశావాహులకు సవాలుగా మారబోతోందని అంటున్నారు. బీజేపీ సైతం ఆషామాషీగా కాకుండా ఎంపీ టికెట్ కేటాయింపు వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంటోందంటున్నారు. పార్టీ సీనియర్ నేతలతో పాటు అన్ని అనుబంధ సంఘాల బాధ్యుల సలహాలు, సూచనలతో ఈ సారి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

బయలెల్లిన మల్లన్న దేవుని పల్లకీ



ఎడ్‌బిడ్ గ్రామం చేరుకున్న మల్లన్న దేవుని పల్లకి

ముథోల్, ఫిబ్రవరి 5 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ మల్లన్న దేవుని పల్లకీ గ్రామం నుంచి బయలుదేరింది. ప్రతీ సంవత్సరం జాతర కంటే 20 రోజుల ముందు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోకి ఈ పల్లకీ వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఆదివారం రాత్రి మల్లన్న పల్లకీ ఎడ్‌బిడ్ గ్రామం నుండి బాజభజంత్రీలతో బయలుదేరింది. ఈ పల్లకీ ముథోల్ నియోజకవర్గంలోని భైంసా, లోకేశ్వరం, కుంటాల, కుభీర్, తానూర్, ముథోల్, బాసర మండలాల్లోని ఆయా గ్రామాల్లో పల్లకీ పూజారులతో పర్యటిస్తుంది. దీంతో ఆ మండలంలోని ప్రజలు మల్లన్న దేవుని పల్లకీని దర్శించుకుంటారు. ఈ పల్లకీ ఫిబ్రవరి 23వ తేదీ పౌర్ణమి రోజు మల్లన్న దేవుని జాతరలో భాగంగా ఎడ్‌బిడ్ మల్లన్న దేవుడి ఆలయంకు చేరుకుంటుంది. ఈ జాతర దేవుని కళ్యాణంతో 23వ తేదీ నుండి 27 తేదీ వరకు ఐదు రోజులు జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ జాతరను యాదవ్ సంఘం, ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ, గ్రామస్థులు కలిసికట్టుగా ఉండి వైభవంగా నిర్వహిస్తారు.

ఎనిమిది పేకాట రాయుళ్ళ పట్టివేత

భైంసా, ఫిబ్రవరి 5 : పట్టణంలోని గోపాల్‌నగర్ కాలనీ పరిధిలో గల అటవీ శాఖ కార్యాలయ సమీపంలోని నివాస గృహంలో పేకాట ఆడుతున్న ఎనిమిది జూదరులను పట్టుకున్నట్లు భైంసా పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పక్కా సమాచారం మేరకు తనిఖీలు చేయగా పేకాట ఆడుతున్న వారు పట్టుబడినట్లుగా వివరించారు. వారి వద్ద నుంచి రూ.70,230 నగదుతో పాటు ఎనిమిది మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

నేడు ముథోల్ విద్యుత్ సరఫరా నిలిపివేత

ముథోల్, ఫిబ్రవరి 5 : మండల కేంద్రమైన ముథోల్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముథోల్ గ్రామంలో విద్యుత్ సరఫరా మంగళవారం నిలిపివేతస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ద్విచక్రవాహనం కారు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

నర్సాపూర్ (జి), జనవరి 5 : మండలంలోని బూర్గుపల్లి(జి) గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రామస్థులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు మిత్రులు ద్విచక్ర వాహనం టీఎస్ 09ఎఫ్ ఎల్ 6419 పై నిర్మల్ వైపు వెళ్తుండగా నిర్మల్ నుండి భైంసా వైపు వెళ్తున్న టీఎస్ 18 1673 నంబరు గల కారు ఢీకొట్టడంతో వర్ధన్‌కు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. సతీష్‌కు కాలు విరిగిపోవడంతో స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పి.నర్సారెడ్డి సంస్మరణ సభకు హాజరైన జిల్లా నేతలు



నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి పి. నర్సారెడ్డి సంస్మరణ సభకు సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు హాజరయ్యారు. గాంధీభవన్ ఇందిరా హాల్‌లో జరిగిన సంస్మరణ సభకు ఆయనతో పాటు సాగర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ నాయకులు బి. గోవర్ధన్‌రెడ్డి, నరేష్ జాదవ్, రమణ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు. నర్సారెడ్డి చేసిన సేవలు కొనియాడారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా ఓ మహోన్నత రాజకీయ వేత్తను కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నర్సారెడ్డి మృతి తీరని లోటని తెలిపారు.

ఖానాపూర్‌లో ముగిసిన అవిశ్వాస బలనిరూపణ ప్రక్రియ

- బల నిరూపణలో నెగ్గిన కౌన్సిలర్లు
- కౌన్సిలర్ల విశ్వాసం కోల్పోయి గద్దె దిగిన చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్
- చైర్మన్ ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపనున్న అధికారులు
- బలనిరూపణ ప్రక్రియకు చైర్మన్, వైస్ చైర్మన్ సహా మరో కౌన్సిలర్ గైర్హాజరు
- పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సత్యంకు 9 మంది కౌన్సిలర్లు మద్దతు
- వైస్ చైర్మన్ కోసం తీవ్ర పోటీ



బలనిరూపణ ముగిసిన అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న కౌన్సిలర్లు



అవిశ్వాసం నెగ్గినట్లు వివరాలు వెల్లడిస్తున్న ప్రిసైడింగ్ అధికారి రత్నకల్యాణి



రాజుర సత్యంకు మిఠాయిలు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్, ఫిబ్రవరి 5 : గత ఏడాది కాలంగా ఆయా కారణాలతో వాయిదా పడుతూ వచ్చిన ఖానాపూర్ మున్సిపల్ అవిశ్వాసం ఎట్టకేలకు సోమవారం ముగిసింది. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్‌లకు వ్యతిరేకంగా 9 మంది కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసం తీర్మానం నెగ్గింది. దీంతో ఇన్నాళ్లు పదవిని కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకున్న అంకం రాజేందర్ ఎట్టకేలకు కౌన్సిలర్ల విశ్వాసం కోల్పోయి గద్దె దిగాల్సిన పరిస్థితి అనివార్యమైంది. సోమవారం ఉదయం ప్రిసైడింగ్ అధికారి నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అవిశ్వాసం తీర్మానంపై బల నిరూపణకు హాజరైన 9 మంది కౌన్సిలర్లు చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్‌లకు వ్యతిరేకంగా ఉండడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో రత్న కళ్యాణి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. తదుపరి ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ వెలువడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నుండి నోటిఫికేషన్ వెలువడిన వెంటనే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. కౌన్సిలర్ల విశ్వాసం కోల్పోయినందున ప్రస్తుత చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్ ఇకపై ఆ పదవులు కోల్పోయి కేవలం కౌన్సిలర్లుగా మాత్రమే కొనసాగుతారని తెలిపారు. చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్‌లకు వ్యతిరేకంగా పార్టీలకు అతీతంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు అవిశ్వాస బలనిరూపణకు హాజర య్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ సహా మరో కౌన్సిలర్ ఈ ప్రక్రియకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

రాజుర సత్యంకు ఏకగ్రీవంగా మద్దతు

మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడిన ఖానాపూర్‌కు తొలి చైర్మన్‌గా ఎన్నికైన అంకం రాజేందర్ కౌన్సిలర్ల విశ్వాసం కోల్పోవడంతో పూర్తికాలం పదవిలో కొన సాగకుండానే తప్పుకోవాల్సి వచ్చింది. అవిశ్వాసం బలనిరూపణ ప్రక్రియ పూర్తయినందున ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం తదుపరి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఉంటుందని అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకోబోతుందనేది స్పష్టం అవుతుందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న రాజుర సత్యంకు పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు మద్దతు ప్రకటించడంతో ఇక ఆయన ఎన్నిక లాంఛన ప్రాయంగానే మారనుందని చెబుతున్నారు.

వైస్ చైర్మన్ తీవ్ర పోటీ

వైస్‌చైర్మన్ పదవి కోసం మాత్రం ముమ్మరంగా పోటీ నెలకొంది. వైస్ చైర్మన్ పదవి కోసం బీఆర్ఎస్ నుంచి మద్దతు ఇచ్చిన జన్నారపు విజయలక్ష్మి, కావలి సంతోష్, పరిమిలత, బీజేపీ నుంచి మద్దతు ఇచ్చిన నాయిని స్రవంతి, ఇండిపెండెంట్ కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్‌లు పట్టుబడుతున్నట్లు సమాచారం. గతంలో వైస్‌చైర్మన్‌గా మైనారిటీలే ఉన్నందున ప్రస్తుతం తమకే కేటాయించాలని ఇద్దరు మైనారిటీ కౌన్సిలర్లు పట్టుబడుతున్నారు.. కాగా అధికార పార్టీకి చెందిన రాజుర సత్యం చైర్మన్‌గా ఎన్నిక కాబోతున్న నేపథ్యంలో ఇద్దరు మైనారిటీ కౌన్సిలర్లు అధికార పార్టీ వారే కావడంతో ఆ కౌన్సిలర్లను బుజ్జగించి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు వైస్ చైర్మన్ పదవిని ఇచ్చేలా చైర్మన్ అవుతాడని భావిస్తున్న సత్యం చర్చలు చేస్తున్నట్లు ముమ్మరంగా ప్రచారం సాగుతోంది.

అట్టహాసంగా ఎల్వీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ



సినీ హీరోయిన్ నేహా శెట్టికి స్వాగతం పలుకుతున్న ఎల్వీఆర్ సిబ్బంది

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్ డిపో సమీపంలో సోమవారం ఎల్వీఆర్ షాపింగ్ మాల్ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, ముత్యం సంతోష్‌గుప్తా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు సాధం అరవింద్, భీమ్ రెడ్డి, రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో సందడి చేసిన సినీ నటి నేహా శెట్టి

జిల్లాకేంద్రంలో సోమవారం సినీ హీరోయిన్ డీజేటిల్లు ఫేమ్ నేహాశెట్టి సందడి చేశారు. స్థానిక బస్ డిపో సమీపంలో ఎల్వీఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభానికి ఆమె ముఖ్యఅతిథిగా వచ్చి ప్రారంభించారు. ఆమె రాక తెలుసుకున్న అభిమానులు నేహాశెట్టిని చూసేందుకు తరలివచ్చారు. ఉదయం నుంచి సమీప గ్రామాల నుంచి ప్రజలు అభినతారను చూసేందుకు రావడంతో రోడ్లన్నీ సందడిగా మారాయి. ఆమె అభిమానులను చూసి సంబరపడింది. ప్రధాన రహదారి ట్రాఫిక్ జాయి అయ్యింది. నేహా శెట్టితో సెల్ఫీలు తీసుకునేందుకు యూత్ తహతహలాడింది. అభిమానుల కోరిక మేరకు ఆమె వారితో సెల్ఫీలు దిగి సంతృప్తి పరిచింది. ట్రాఫిక్ కంట్రోల్ చేయడం ఇబ్బందిగా మారడంతో షాపింగ్ మాల్ కిక్కిరిసిపోయింది. ఎల్వీఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం శివప్రసాద్, ప్రణీత్ నేహా శెట్టికి పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెడికల్ షాప్ సీజ్

ఔషధాల స్వాధీనం



మందులు స్వాధీనం చేసుకున్న అధికారులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : మండలం లింబా(కే) గ్రామంలో సోమవారం సూర్యచంద్ర మెడికల్ షాప్‌ను అధికారులు సీజ్ చేశారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా జీవన్ అనే వ్యక్తి మందులు విక్రయించినట్లు గుర్తించారు. రూ.2 లక్షల విలువైన 125 రకాల ఔషధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏడీ నిజామాబాద్ నర్సయ్య మాట్లాడుతూ... 1940 సెక్షన్ 18సి ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిర్మల్ ఇన్స్‌పెక్టర్ ఏ. శ్రీలత, నిజామాబాద్ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్, తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

మావల, ఫిబ్రవరి 5: గత ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని, గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి గ్రామంలో ఎన్ఆర్‌జి ఎస్ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు గ్రామ పంచాయతీల కొరకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. కానీ గత ప్రభుత్వం నిధులను మంజూరైన నిధులను దారి మళ్లించి గ్రామాల అభివృద్ధి అడ్డుకట్ట వేసిందన్నారు. గ్రామాల్లో జరగాల్సిన కార్యక్రమాలన్నీ మూలనపడ్డాయని, కనీసం గ్రామ పంచాయతీ కార్మికులకు కూడా జీతాలు ఇవ్వలేని దుస్థితికి గత ప్రభుత్వం పంచాయతీలకు తీసుకొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను చివరి వ్యక్తి వరకు అందించే బాధ్యత నాది అని అన్నారు. ఎన్నికల వరకే పార్టీల మధ్యన, అధికారుల మధ్యన విభేదాలు గాని ఎన్నికల్లో గెలిచిన తర్వాత నేను ప్రజల మనిషిని పార్టీలకతీతంగా పని చేస్తానని అన్నారు. అధికారులు కూడా వెంటనే స్పందించి మంజూరైన పనులకు నిధులు సమకూర్చి పనులను ప్రారంభించాలని కోరారు. నాయకులకు అధికారులకు మధ్యన సమన్వయం ఉంటేనే అభివృద్ధి త్వరితగతిన పూర్తవుతుందని అన్నారు. ఇందులో సర్పంచ్ మయూరి చంద్ర, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజచేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు : జాన్సన్ నాయక్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 5: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే గెలుపని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారాన్ని కోల్పోయినప్పటికీ పార్టీ బలంగా ఉందని, కార్యకర్తలు అధైర్యపడవద్దని సూచించారు. ఈ నెల 12న ఖానాపూర్ పట్టణంలో నిర్వహించే నియోజకవర్గస్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. ఇందులో ఎంపీపీ పోటే శోభాబాయి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు డోంగ్రే మారుతి పటేల్, వైస్ ఎంపీపీ పడ్వాల్ గోపాల్, మండల కోఆప్షన్ సభ్యులు మీర్జా జీలానీ బేగ్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అంజద్, మాజీ ఎంపీపీ కనక తుకారం, ఎంపీటీసీ కోవా రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తలమడుగు, ఫిబ్రవరి 5: మండలంలో డొర్లి రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలండొర్లి రైల్వే గేట్ సమీపంలో సోమవారం భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కదిరి ఆశన్న (72) అనే వ్యక్తి ఝరి గ్రామంలో గల కూతురు అల్లుడు గడుగు పోచన్న ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో గల రైల్వే గేటు పట్టాలు దాటుతుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న రైలుబండి ఢీకొట్టింది. దీంతో ఆశన్న అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 5: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని వాగ్దారి గ్రామంలో బంజారా ఉషోదయ యువకుల ఆద్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. యువకులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం బోథ్ ఎక్స్ రోడ్ సమీపంలో గల పుట్టను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌రెడ్డి, పాండు, నానక్‌సింగ్, గణేష్, మురళీ గ్రామస్థులు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

'శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి'

బోథ్, ఫిబ్రవరి 5: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు సహకరించాలని ఆదిలాబాద్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం బోథ్ సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరంగా కృషి చేస్తున్నారని అయితే ప్రజల సహకారం అవసరమన్నారు. అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఫలితంగా అసాంఘిక కార్యకలాపాలు గుర్తించే వీలుంటుందన్నారు. ఇప్పటికే హైదరాబాద్ జిల్లాలో అనేక గ్రామాల్లో సీసీ కెమెరాలు గ్రామాల ప్రజలు ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకున్నారని, అయితే సీసీ కెమెరాలు లేనిచోట ప్రజలు వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని, కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట సీఐ భీమేష్, ఎస్సై రాములు ఉన్నాం

అనుమతి లేని మెడికల్ షాపు సీజ్

కుంటాల, ఫిబ్రవరి, 5 : కుంటాల మండలంలోని లింబా (కే) గ్రామంలో అనుమతి లేకుండా నడుపుతున్న ఓ మెడికల్ షాపును సోమవారం డ్రగ్స్ అధికారులు సీజ్ చేశారు. లింబా (కే) గ్రామంలో సూర్యచంద్ర మెడికల్ షాపును నిర్వహిస్తున్న జీవన్ ఎలాంటి డ్రగ్స్ లైసెన్స్ లేకుండా మెడికల్ షాపును నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో మెడికల్ షాపులోని మందులను స్వాధీనపరుచుకున్నట్లు సదరు వ్యక్తిపై కోర్టులో కేసు వేయడం జరుగుతుందని అధికారి శ్రీలత తెలిపారు. అధికారులు శ్రీకాంత్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో
పకడ్బందీగా వ్యవహరిద్దాం

● సరిహద్దు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం ● నాందేడ్‌లో రాష్ట్ర సరిహద్దు పోలీసు ఉన్నతాధికారుల సంయుక్త సమావేశం ● పాల్గొన్న నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి నాందేడ్ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు


మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు

భైంసా, ఫిబ్రవరి 5 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా వ్యవహరించాలని సరిహద్దు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై మహారాష్ట్ర - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో నాందేడ్ రేంజ్ డీఐజీ శశికాంత్ మహావార్కర్, నాందేడ్ ఎస్పీ కృష్ణ కొకటేల తో పాటు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగినవార్, కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మలు సమావేశమై పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన భద్రతాచర్యలు, బందోబస్తు విధానాలపై చర్చించారు. రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు ప్రణాళికబద్ధమైన విధానాలతో ఎన్నికల ప్రక్రియ ఆద్యంతం సమన్వయం, సమష్టి కృషితో ప్రశాంత వాతవరణంలో పూర్తయే దిశగా వ్యవహరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం పంచుకుంటూ ఎలాంటి లోపాలకు అస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికలకు పకడ్బందీగా నిర్వహించేందుకు సరిహద్దు మార్గంలో.. సమాచారం వ్యూహం అమలు చేయ డానికి రెండు రాష్ట్రాల పోలీసులు సంసిద్ధం కావాలని నిర్ణయించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రెండు నెలల ముందు నుంచి రాష్ట్రాల సరిహద్దు పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా ఎన్నికల నియమావళిలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను అందించే చర్యలు చేపట్టారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే సమాచారంతోనే అక్రమ మార్గాల ద్వారా వచ్చే మద్యం, నగదు ఇతర వాటిని అడ్డుకోవచ్చని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శనం చేసేందుకు మూడు అంచెల్లో అధికారులకు బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించారు. మహారాష్ట్ర పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారం వ్యవస్థను పరస్పర మార్పిడి చేసుకోవడంతోనే ఎన్నికలను సజావుగా ముగించే దిశగా కార్యాచరణకు రంగం సిద్ధం చేసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఎన్నికలలో ధనం, మద్యం పాత్ర విశేషంగా ఉంటుందని.. వాటిని అరికట్టడానికి ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు ఇప్పటి నుంచే సంసిద్ధంగా ఉండి విశేష కృషి చేయాలని సూచించారు. మావోయిస్టులను జిల్లాల్లోకి రానివ్వకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్ చేస్తూ మావోయిస్టు యాక్షన్ టీంలను నిలువరించే బహుముఖ వ్యూహం రచించాలని పిలుపునిచ్చారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ పోలీసులు ప్రస్తుతం వినియోగిస్తున్నారని, వాటి ద్వారా ఎలాంటి సమస్యలనైనా క్షణాల్లోనే పరిష్కరించే దిశగా కిందిస్థాయి సిబ్బంది కృషి చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. సమావేశంలో నాందేడ్ అదనపు ఎస్పీ అభినాష్, జిల్లా భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ సీఐలుఅధికారులు పాల్గొన్నారు.

మీ సేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరిస్తాం

నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


వినతిపత్రం అందిస్తున్న మీ సేవ కేంద్రం నిర్వాహకులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : రాష్ట్రంలో మీ సేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యేకు మీ సేవ నిర్వాహకులు వినతి పత్రాన్ని అందజేశారు. నిర్మల్ జిల్లాలో 92 మీ సేవ కేంద్రాలు సేవలందిస్తున్నాయని రాష్ట్రంలో 4,500లు మీ సేవ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. డిజిటల్ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న మీ సేవ కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అద్దె కూడా చెల్లించలేని గడ్డు స్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. మీ సేవ కేంద్రాలు పని చేయకుంటే ప్రభుత్వానికి ప్రజలకు ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. గత ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీ సేవ కేంద్ర నిర్వాహకులను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలని, కమిషన్‌లను పెంచి న్యాయం చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీలో ఈ అంశం గూర్చి లేవనెత్తి వారికి న్యాయం కలిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నిర్మల్ రూరల్ : గావ్ చలో కార్యక్రమంలో భాగంగా నిర్మల్ రూరల్ మండలం తల్వేద గ్రామంలో నిర్వహించిన సమా వేశంలో ఎమ్మె ల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... గడిచిన పదేళ్లలో బీజేపీ కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి అత్యధిక మెజారిటీ ఇచ్చి నరేంద్ర మోదీకి బహుమతి ఇవ్వాలని తెలిపారు. అనంతరం గావ్ చలో అభియాన్ కార్యక్రమంను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు తోకల అనిల్, నరేందర్, జమాల్, భూపాల్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

యోగా విద్యార్థులను
అభినందించిన నిర్మల్ మున్సిపల్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : బెల్లంపల్లిలో నిర్వహించిన యోగ పోటీల్లో విజయం సాధించిన నిర్మల్ విద్యార్థులను చైర్మన్ ఈశ్వర్ అభినందించారు. సోమవారం శివసాయి పతంజలి యోగ నేచర్ క్యూర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో విజయం సాధిస్తే మంచి ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. యోగ నిత్యజీవితంలో భాగం కావాలని ఆకాంక్షించారు. యోగాతో సర్వరోగాలు తొలగి ఆరోగ్య జీవనం గడపవచ్చన్నారు. యోగ నిపుణురాలు అన్నపూర్ణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నృత్యంలో చిన్నారికి నాట్య సరస్వతీ పురస్కారం


సాన్వి నృత్య ప్రదర్శన

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : నిర్మల్ జిల్లాకు చెందిన సాన్వి మాల్యా ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించి నాట్య సరస్వతి పురస్కారాన్ని అందుకుంది. సాన్వి డాక్టర్ చంద్రప్రకాష్, శృతిల కూతురు. సాన్వి నృత్యమాల నాట్య అకాడమీ గురువు ఏలేటి అంజలి రెడ్డి వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంటోంది. సాన్విని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

పాఠశాలకు ప్రింటర్ విరాళం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 5 : మండలంలోని సాంగ్వి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ గ్రామ మాజీ సర్పంచ్ అచ్యుత్‌రావు ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ, ఉపాధ్యాయులు నర్సయ్య, మురళీ మనోహర్ రెడ్డి, స్థానిక నాయకులు రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ముథోల్‌లో గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో పార్టీ వక్తలు

ముథోల్, ఫిబ్రవరి 5 : గావ్‌చల్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మండల బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గావ్ చలో అభియాన్ కార్యక్రమం ద్వారా 10 సంవత్సరాలుగా కేంద్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా గ్రామాల్లో గడప గడపకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని తెలపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ గడ్డపై అత్యధిక మెజారిటీతో భారతీయ జనతాపార్టీ జెండా ఎగరవేయడం లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు అభియానులు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గావ్ చలో అభియాన్ మండల కన్వీనర్ దేవోజి భూమేష్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యం రెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ నర్సారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మీ నర్సా గౌడ్, మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జి తాటివార్ రమేష్, తాజా మాజీ సర్పంచ్‌లు స్వర్ణలత దత్తాత్రి, సత్యా గౌడ్, రామచందర్, సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ మోహన్ యాదవ్, మండల నాయకులు మోహన్ రెడ్డి, సంగోళ్ల పోతన్న, ధర్మపురి శ్రీనివాస్, సప్పటోళ్ల పోతన్న, జీవన్, సాయినాథ్, ఆయా గ్రామాల బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి 5: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలానికి చెందిన కేజీబీవీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికవ్వడంతో నేరడిగొండలోని తన నివాసంలో క్రీడాకారులకు శాలువా కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. తన సొంత మండలం నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఎంతో గర్వంగా ఉందన్నారు. క్రీడాకారులకు ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తానని అన్నారు. ఇందులో కేజీబీవీ ఎస్‌వో రజిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు షీటీం సభ్యుల అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5: షీ టీం ఆధ్వర్యంలో జడ్పీఎస్ఎస్ స్కూల్ గజిటెడ్ నెంబర్ 2 పాఠశాలలో విద్యార్థులకు షీ టీం బృందం సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఎవరైనా పోకిరిలు ఈ- చీటింగ్, ర్యాగింగ్ చేసిన, ఏడి పించినా, వెంటపడి వేధించినా, అదే విధంగా ఫోన్‌లో చాటింగ్ ద్వారా వేధించినట్లయితే షీ టీం సభ్యులకు తెలుపాలన్నారు. వాట్సాప్ ఫేస్ బుక్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయాలు పెంచుకోవద్దని, వాటి ద్వారా మోసపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటువంటి నేరాలు జరిగిన వెంటనే షీటీం నెంబర్ 8712659953కి కాల్ చేయాలని, సైబర్ నేరాలు జరుగుతే వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు. పట్టణానికి అవతల ఉన్న పిల్లలకు, నడుచుకుంటు వచ్చే పిల్లలకు ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 100కి కాల్ చేయాలని వివరించారు. మైనర్ అమ్మాయిల పై అఘాయిత్యాలు జరిగే ఫోక్స్ యాక్ట్ కింద చర్యలు తప్పవన్నారు. ఎవరైతే షీ టీంకి ఫిర్యాదు చేస్తారో వారి పేరు వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో స్కూల్ టీచర్లు, షీ టీం బృందం సభ్యులు బి.సుశీల, జి.సత్యమోహన్లు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు
మహిళా మోర్చా చురుగ్గా పని చేయాలి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 5 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం మహిళా మోర్చా చురుగ్గా పని చేయాలని రాష్ట్ర మోర్చా అధ్యక్షురాలు గీతారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా మోర్చా జిల్లా సభ్యులతో సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో మహిళలు విశేషంగా కృషి చేయడం వల్లే అభ్యర్థులు విజయం సాధించారన్నారు. మోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు మహిళలకు వివరించాలన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు భద్రత కల్పించడంలో విఫలమవుతున్నారన్నారు. జిల్లా మహిళా మోర్చా నాయకులు అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్యారంటీలతోనే ప్రభుత్వం కాలం వెల్లదీస్తోంది

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 2 గ్యారంటీలను మాత్రమే అమలు చేసి కాలం గడుపుతోందని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ సోమవారం ఆరోపించారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో నిర్వహించిన పార్టీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు చేశారు. 420 హామీలు ఇచ్చి కేవలం 6 గ్యారంటీలే అని ప్రచారం చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లించడం జరుగుతుందన్నారు. సమావేశంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్, మండల అధ్యక్షుడు పొలాస గోవర్ధన్, నాయకులు అంబటి భూమేష్, దేవరాజు, ప్రదీప్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే
జిల్లా సదస్సును జయప్రదం చేయండి

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 5 : 16వ తేదీన జరిగే పారిశ్రామిక భారత్‌బంద్ జయప్రదం చేయాలని దేశవ్యాప్తంగా ఇచ్చిన కార్మిక రైతు సంఘాల పిలుపు మేరకు మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక సంఘాల కార్యాలయంలో జిల్లా సన్నాహక సదస్సు ఉదయం 12 గంటలకు ఉంటుందని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తుడుందెబ్బపై విమర్శలు చేయటం సరికాదు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 5 : ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విమర్శలు చేయడం సరికాదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ అన్నారు. సోమవారం స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.


సాయి సచ్చరిత్ర పారాయణం చేస్తున్న భక్తులు

అట్టహాసంగా సాయినాథుని
వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

ఖానాపూర్, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను ఖానాపూర్ సీఐ డి. మోహన్, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేందర్ ధ్వజారోహణ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిబాబా పారాయణం మండలంలో సాయి సచ్చరిత్ర పారాయణ అన్ని 180 మంది భక్తులతో ప్రారంభించారు. ఈ నెల 12వ తేదీన సాయిబాబా జాతర మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్సైలు లింబాద్రి, రజినీకాంత్, ప్రభాకర్‌రెడ్డిలు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్, కోశాధికారి శేఖరయ్య, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు బక్కశెట్టి కిషోర్, ఆలయ కమిటీ బృందం, సాయిబాబా భక్త బృందం, తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

● విద్యార్థుల వసతి సౌకర్యాల పరిశీలన

బాసర, ఫిబ్రవరి, 5 : ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ సోమవారం బాసర ట్రిపుల్ ఐటీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులు బస చేసే గదులు, స్నానపు గదులు, భోజనశాలలను పరిశీలించారు. హాస్టల్ భవనంలో అపరిశుభ్రంగా ఉన్న పరిస్థితులను చూసి అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ధైర్యంగా ఉండాలని ఒకటి, రెండు నెలల్లో యూనివర్సిటీలో పరిస్థితిని చక్కబెట్టనున్నట్లు హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. దాదాపు 3 గంటల పాటు యూనివర్సిటీలో పర్యటించారు. ట్రిపుల్ ఐటీలో విజిలెన్స్ విచారణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. వారి వెంట బీజేపీ పార్టీ మండల నాయకులు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి

భైంసా : నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్ పేర్కొన్నారు. సోమవారం భైంసా పట్టణంలోని సుద్ధవాగు పరివాహక ప్రాంతంలో గల శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతులు, సౌకర్యాలు మెరుగు పరుస్తామన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాలను పెంచుకొని ఆధ్యాత్మిక భావజాలాలను పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం దశల వారిగా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి నెలకొనకుండా ఉండేందుకు గానూ ప్రణాళిక బద్ధమైన ముందస్తు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా సుద్ధవాగు శివాలయంలో జరిగిన అన్నపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో బీజేపీ ప్రతినిధులు తూమోల్ల దత్తుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల భవనం మంజూరు చేయాలి


మావల, ఫిబ్రవరి 5 : పట్టణంలోని మున్సిపల్ 12వ వార్డు న్యూ హౌసింగ్ బోర్డు పరిధిలో 170 అదిత్యనగర్ కాలనీలో ప్రాథమిక పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో యువజన కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్ రాహుల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు సామ రూపేష్‌రెడ్డి, మావల మండల అధ్యక్షుడు శేఖర్, ఉప సర్పంచ్ మల్లయ్య, రంజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చర్యలకు డిమాండ్

బోథ్, ఫిబ్రవరి 5: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి డిమాండ్ చేశారు. సోమవారం బోథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు షేక్ అబూద్, గడ్డల నారాయణ, తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 । కనిష్ఠం 18.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

మంగళవారం 6 ఫిబ్రవరి 2024



అర్జీదారుల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్

సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5: ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమర్పించిన దరఖాస్తులను స్వీకరించారు. ధరణి, ఆసరా, రెండు పడక గదుల ఇళ్లు, తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. దరఖాస్తుదారులకు రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించారు. అనంతరం పరిశ్రమల శాఖపై సమీక్షిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం సబ్సిడీ రుణాలను అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే, పీఎం విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని, నిరుద్యోగులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం కింద వడ్రంగులు, పడవల తయారీదారులు, ఆయుధ/కవచ తయారీదారులు, కమ్మరులు, సుత్తి, ఇంకా పరికరాల తయారీదారులు, తాళాల తయారీదారులు, బంగారం పనిచేసే వారు, కుమ్మరులు, శిల్పులు (ప్రతిమలు, రాతి చెక్కడం పని చేసేటటువంటి) రాళ్లను పగులగొట్టే వృత్తిలో ఉండే వారు, చర్మకారులు, పాదరక్షల తయారీదారులు, తాపి పనివారు, గంపలు/చాపలు/చీపురులను తయారు చేసేవారు, కొబ్బరినారతో తయారయ్యే వస్తువులు, (సాంప్రదాయక ఆటబొమ్మల రూపకర్తలు) క్షురకులు (నాయి వృత్తిదారులు) మాలలు అల్లేవారు, రజకులు, దర్జీలు, చేపలను పట్టేందుకు ఉపయోగించే వలలను తయారు చేసే వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, రేషన్‌కార్డు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సీఎస్‌సీ సెంటర్స్, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయలు రుణం మంజూరు చేయడం జరుగుతుందని, నిర్ణీత సమయంలో చెల్లించిన వారికి తిరిగి రూ.2లక్షల రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతీఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఇందులో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్‌రాజు, మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్‌రమేష్, మున్సిపల్ కమిషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



టికెట్ లక్కు.. ఎవరికో?

- సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికలు
- అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేకదృష్టి సారించిన ప్రధాన పార్టీల నేతలు
- కాంగ్రెస్ పార్టీలో పోటాపోటీ
- బీజేపీలో ఆశావహుల క్యూ
- దీటైన అభ్యర్థి కోసం బీఆర్ఎస్ వెతుకులాట
- త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రకటించేందుకు సిద్ధమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం

ఆదిలాబాదు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడతో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేకదృష్టిని సారించాయి. ఈసారి బీఆర్ఎస్ పార్టీ అధికారానికి దూరం కావడం, అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని దక్కించుకోవడంతో రాజకీయ అంచనాలన్నీ తారుమారయ్యాయి. ఆదిలాబాదు పార్లమెంటు ఎస్టీ రిజర్వు కావడంతో అన్ని పార్టీలలో ఆశావహ నేతల జాబితా అధికంగానే కనిపిస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల టికెట్ల కోసం నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల 8వ తేదీన ఓటరు తుది జాబితాను విడుదల చేసి ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. అలాగే ఆశావహ నేతల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ప్రధాన పార్టీలు.. గెలిచే అభ్యర్థులను బరిలో దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే పార్లమెంటు స్థాయి సమావేశాలు నిర్వహించిన బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరన్నది ఇంకా స్పష్టత రావడం లేదు. ఎస్టీ రిజర్వు స్థానం కావడంతో అన్ని పార్టీలు ఆదివాసీలు, లంబడా సామాజిక వర్గానికి చెందిన నేతలపైనే దృష్టి సారించాయి. అయితే అభ్యర్థుల ఖరారు తర్వాత జిల్లా రాజకీయాల్లో మరిన్ని మార్పులు, చేర్పులు చోటు చేసుకునే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



కాంగ్రెస్‌కు 25మంది దరఖాస్తు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ గ్రాఫ్ భారీగా పెరిగింది. దీంతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు పలువురు నేతలు పోటీ పడుతున్నారు. ఆదిలాబాదు పార్లమెంటు పరిధిలో సుమారు 25మంది ఆశావహ నేతలు కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇందులో ప్రధానంగా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆదివాసీ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ పార్టీ నేత నరేష్ జాదవ్, శ్రీనివాస్ జాదవ్.. ఇంకా మరికొంత మంది నేతలు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. అయితే కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటు పరిధిలో మొత్తం 19 శాతం ఓట్లను దక్కించుకున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేస్థానం గెలవడం.. ఆ పార్టీకి కొంత ఇబ్బందికరంగానే మారింది. గతంలో రేఖానాయక్‌కు టికెట్ హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్నా.. కాంగ్రెస్‌లో చివరివరకు ఏం జరుగుతుందో? చెప్పలేమన్న అభిప్రాయాలు వ్యక్తంమవుతున్నాయి.

సిట్టింగ్‌కు మళ్లీ అవకాశం?

బీజేపీలో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు మళ్లీ టికెట్ దక్కుతుందా? లేదా? కొత్త అభ్యర్థులను బరిలోకి దింపుతారా? అనేదే ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఎవరికి వారే టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నా.. ఎంపీ సోయం మాత్రం మళ్లీ తనకే అవకాశం వస్తుందన్న ధీమాతో కనిపిస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ఆయనకు వ్యతిరేఖంగా కొత్త అభ్యర్థులను తెరపైకి తెస్తున్నా.. అధిష్ఠానం మాత్రం ఆదివాసీ నేతవైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల మాజీ ఎంపీ గోడం నగేష్ ఢిల్లీకి వెళ్లి బీజేపీ అధిష్ఠానం పెద్దలను కలిసినట్లు వార్తలు రావడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ సారి సిట్టింగ్ ఎంపీని మారుస్తారా? లేదా? ఆయనకే మళ్లీ టికెట్ ఇస్తారా? అనే చర్చ సాగుతోంది. అయితే అధిష్ఠానం పెద్దలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి సర్వేల తర్వాతనే అభ్యర్థులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. అంతేకాకుండా మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కూడా ఎంపీ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముగ్గురిలో ఎవరో ఒకరు!?

బీఆర్ఎస్ పార్టీ అధికారానికి దూరం కావడంతో ఆ పార్టీలో పరిస్థితులు తారుమారయ్యాయి. గతంలో భారీ పోటీ కనిపించినా.. ఈసారి మాత్రం పోటీకి అంతగా ఎవరూ ఆసక్తి చూపడం లేదంటున్నారు. పార్టీలో కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గోడం నగేష్, జాన్సన్‌నాయక్‌లలో ఎవరో ఒకరికి టికెట్ దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ముగ్గురు నేతలు కాకుండా కొత్త నేతలు కూడా ఎన్నికల బరిలో దిగే అవకాశాలు లేకపోలేదు. గత పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన గోడం నగేష్.. రెండవ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈసారి ఎన్నికల బరిలో ఉంటారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఇప్పుడైతే అధికారం కూడా లేకపోవడంతో క్యాడర్‌లో కొంత నిరుత్సాహం కనిపిస్తోంది. పార్లమెంటు పరిధిలో బోథ్ ఆసిఫాబాదు స్థానాలను దక్కించుకుని కొంతమెరుగ్గానే కనిపిస్తున్నా.. పార్లమెంటు ఎన్నికల్లో ఓటరు నాడి ఎలా ఉంటుందో? చెప్పలేమన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.



సంక్షిప్త సమాచారం



పోలీసు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5: జిల్లా పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోలీసు క్యాలెండర్‌ను జిల్లాకేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో అధికారుల సమక్షంలో ఎస్పీ గౌస్‌ఆలం సోమవారం విడుదల చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నూతన ఉత్సాహంతో ప్రజలకు మరింత దగ్గరై విధులు నిర్వహించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. పోలీసు దర్యాప్తులో మరింత సాంకేతిక పరిజ్ఞానం జోడించి నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్‌బీ సీహెచ్.శ్రీనివాస్ జి. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.మురళి, ఏవో భక్తప్రహ్లాద్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, అసోసియేషన్ సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ చేసిందేమీ లేదు'

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 5: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీ గిరిజనులకు ఎలాంటి న్యాయం జరగలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు మెస్రం నాగనాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ జిల్లా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కూడా ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేకప్రేమ చూపెట్టి దత్త తీసుకుని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తారన్నారు. కానీ అప్పటి బీఆర్ఎస్ సీఎం కేసీఆర్ ప్రభుత్వం జిల్లాపై చిన్న చూపుచుశారని, బీఆర్ఎస్ ప్రభుత్వ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే జిల్లాను దత్తాత తీసుకోవడంతో పాటు అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనానికి రూ.కోటి కేటాయించారని, ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబీకులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, షేక్, ప్రకాష్, లక్కేరావు, మాదావి, లేతు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రాయి ఆలయానికి మెస్రం వంశీయులు

- ఆదివాసీల దేవతకు మెస్రంల ప్రత్యేక పూజలు
- మర్రి చెట్టు వద్ద బస
- ఈనెల 9న నాగోబాకు మహాపూజలతో జాతర ప్రారంభం



ఇంద్రాయి దేవతకు మొక్కుతున్న మెస్రం వంశీయులు



పవిత్ర గంగాజలంతో కాలినడకన ఆలయానికి వస్తూ..



మర్రి చెట్టుపై గంగాజల కలశాన్ని భద్రపరుస్తూ..



ఆదివాసీల దేవతకు మొక్కుతూ..

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 5: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా పేరొందిన కేస్లాపూర్ నాగోబా జాతర పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 9న నాగోబా ఆలయంలో నిర్వహించే మహాపూజకు అవసరమగు గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు సోమవారం సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ మండల కేంద్రంలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గంగాజలాన్ని చెట్టుపై తెల్లనివస్త్రంతో కట్టి భద్రపరిచారు. సంప్రదాయం ప్రకారం ఇంద్రాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు తయారు చేసి ఇంద్రాయికి సమర్పించారు. గంగాజలంతో ఇంద్రాయి ఆలయానికి మెస్రం వంశీయులు చేరిన విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల మెస్రం వంశీయులు ఎడ్లబండ్లతో ఇంద్రాయి ఆలయానికి చేరుకుని పూజలు చేసి కుటుంబ సమేతంగా ఇంద్రాయి ఆలయ ఆవరణలో సాయంత్రం వరకు బస చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఇంద్రాయి దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి సంప్రదాయ వాయిద్యాల నడుమ గంగాజలంతో కాలి నడకన, మరికొందరు కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లపై కేస్లాపూర్‌కు బయలుదేరారు.

మర్రి చెట్టు వద్దకు మెస్రంలు

పవిత్ర గంగాజలంతో తిరిగి వచ్చి ఇంద్రాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మెస్రం వంశీయులు రాత్రి కేస్లాపూర్ గ్రామ పొలిమేరలో ఉన్న మర్రి చెట్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ 22 కితల వారీగా బస చేశారు. మర్రి చెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ఈనెల 6, 7, 8వ తేదీ వరకు సంప్రదాయ పూజలు చేయనున్నారు. అనంతరం గంగాజలంతో ఇంద్రాయి ఆలయానికి చేరుకుని సంప్రదాయ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి కేస్లాపూర్ మర్రి చెట్లకు చేరుకున్న మెస్రం వంశీయులు అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. కాగా మెస్రం వంశీయులు మర్రి చెట్లు ప్రాంతంలోని గంగాజలంను మోదుగ చెట్టుపై తెల్లని వస్త్రంతో కట్టి భద్రపరిచారు. ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకుని కుటుంబ సమేతంగా బస చేశారు. అదేవిధంగా మంగళవారం రాత్రి మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావుతో పాటు మెస్రం వంశీయులు పటేళ్లు మర్రి చెట్ల వద్దకు చేరుకుని ఈనెల 9న నాగోబాకు నిర్వహించే మహాపూజలతో పాటు తూమ్ (పిండ ప్రదానం) పూజల నిర్వహణపై చర్చించనున్నట్లు మెస్రం వంశీయుల పెద్దలు తెలిపారు. మెస్రం వంశీయులకు ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో నాగోబా ఆలయ చరిత్రను సంప్రదాయ వాయిద్యం కిక్రి వాయిస్తూ బోధించనున్నారు. అలాగే మెస్రం వంశంలో మరణించిన పెద్దల పేరిట తూమ్ (కర్మకాండ) పూజలు చేయనున్నట్లు మెస్రం వంశీయుల పెద్దలు తెలిపారు. 9న మర్రి చెట్ల వద్ద నుంచి గోవ్వాడ్‌కు చేరుకుంటారు. అదేరోజు రాత్రి నాగోబా దేవతకు మహాపూజలతో జాతరను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కటోడ మెస్రం కోసురావు, పర్ధాంజి, మెస్రం దాదారావు, కోసు కటోడ, కటోడ మెస్రం హనుమంతరావు, మెస్రం వంశీయులు నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, తదితరులు పాల్గొన్నారు.



అంతర్‌గాంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పాఠశాలలో ఉపాధ్యాయుడి నియామకం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భీంపూర్, ఫిబ్రవరి 5: భీంపూర్ మండలం వాడూరు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఈనెల 3న 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో 'విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులేరి?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. కామట్‌వాడ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను, వాడూర్ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు బోధిస్తున్నాడు. దీంతో విద్యార్థులు గ్రామస్థులు, విద్యార్థులు 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు తెలిపారు. అలాగే, అంతర్గాం పాఠశాలలోనూ ఉపాధ్యాయుడిని నియమించాలంటున్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశామని వివరించారు. కాగా, సోమవారం అధికారులు స్పందించాలంటూ విద్యార్థులు, గ్రామస్థులు పాఠశాలలో ఆందోళన చేపట్టారు.

సీఎం పర్యటనతో అమరవీరుల కుటుంబాలకు లబ్ధి : ఆత్రం

ఉట్నూర్, ఫిబ్రవరి 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి పర్యటనకు రావడంతో ఇంద్రవెల్లి కాల్పుల్లో మృతి చెందిన అమరవీరుల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని తుడుందెబ్బ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆత్రం తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురక బాపురావు సీఎం పర్యటన పట్ల అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో ఉన్న ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి మంచి కార్యక్రమం చేయలేదని అన్నారు. గులాబీ కండువాతో కాలం గడుపుతూ.. అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేదంటే గ్రామాలలోకి రానీయమన్నారు. పూటకొక పార్టీ మార్చే బాపురావు రాజకీయాల కోసం జాతిని తప్పుతోవ పట్టిస్తున్నారని విమర్శించారు. 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదివాసీలకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో లంబాడాకు టికెట్ ఇస్తే ఆదివాసీల ఉద్యమం ఎటు పోయిందన్నారు. ఇప్పటికైనా బాపురావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఆదివాసీల ఉద్యమంవైపు నడవాలన్నారు. ఈ సమావేశంలో ఎడమ కొద్దు, శ్యామ్‌రావు, అన్నపూర్ణ, బీమా, సీతారం, విజయ, వీనాబాయి, నారాయణ, యశ్వంత్, ప్రవీణ్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

'వ్యాధులపై అవగాహన అవసరం'

మావల, ఫిబ్రవరి 5: విద్యార్థులు వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి సీడాం వామన్‌రావు అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుష్ఠు వ్యాధి అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు, చికిత్స తదితర విషయాలు వివరించారు. అందరూ అపోహలు వీడి, తామంత తాముగా పరీక్ష చేసుకుని, అనుమానం ఉంటే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్సలు అందిస్తామన్నారు. కుష్ఠు రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతి రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీహరి, లక్ష్మణ్, ఎల్టీ రమణచారి, ఏఎన్ఎం తులసి, ఆశా కార్యకర్తలు దీక్ష, సంగీత, పుష్ప విద్యార్థులు పాల్గొన్నారు.



చర్లపల్లి గ్రామ సమీపంలో బోల్తా పడ్డ ఆర్టీసీ బస్సు

చర్లపల్లి వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా

- ఐదుగురికి తీవ్రగాయాలు
- ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు

తలమడుగు, ఫిబ్రవరి 5: మండలంలోని చర్లపల్లి గ్రామ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. ఈ సంఘనటలో డ్రైవర్‌తో సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రం నుంచి టీఎస్ ఆర్టీసీ (01యూసీ 6541) బస్ ఆదిలాబాద్ డిపో నుంచి ఉదయం 11గంటలకు ఝరిపూనగూడకు బయల్దేరింది. అయితే, మార్గమధ్యలో చర్లపల్లి గ్రామ సమీపంలో మలుపు వద్ద ప్రమాదవశాత్తు బస్సు రోడ్డు పక్కన గల గుంతలో బోల్తాపడింది. దీంతో అందులోని ఐదుగురు ప్రయాణికులతో పాటు డ్రైవర్ అజయ్ తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో వెంటనే అక్కడ ఉన్న స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం క్షతగ్రాతులను ఆదిలాబాద్ రిమ్స్ తరలించారు. కాగా, గాయపడ్డ ప్రయాణికుల్లో ఝరి గ్రామానికి చెందిన శంకర్, గంగమ్మలతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. 10 నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకుంటామనే సమయంలోనే ఈ సంఘటన చోటు చేసుకోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం ఆర్టీసీ డీఎం కల్పనకు సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పూర్తి వివరాలు సేకరిస్తామన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా, రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పరామర్శించి వారికి మెరుగైన వైద్య సేవలుఅందించాలని రిమ్స్ వైద్యులకు సూచించారు. ఈ మేరకు తలమడుగు ఏఎస్సై సురేందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఆర్టీసీ డీఎం కల్పన